క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా మందిరంలో ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, కాకడహారతి, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ సహకారంతో అర్చకులు నర్తె నరసింహాచార్యులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

గరుగుబిల్లి: మండలంలోని గిజబ పునరావాస గ్రామంలో సోమవారం నుంచి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామమైన గిజబ పునరావాస గ్రామంలో గ్రామస్తులు, దాతలు సహకారంతో శివాలయాన్ని నిర్మించారు. మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ మరడాన సింహాచలంనాయుడు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

5డీ థియేటర్ పునఃప్రారంభం



5డీ థియేటర్ వద్ద పర్యాటకులు

సీతంపేట: స్థానిక అడ్వంచర్ పార్కులో ఉన్న 5డీ థియేటర్ ఆదివారం నుంచి పునఃప్రారంభమైంది. గత కొద్దిరోజులుగా మరమ్మతులకు గురికావడంతో ఇందులో ప్రదర్శనలు నిలిపివేశారు. మరమ్మతు పనులు పూర్తికావడంతో పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు బెన్హర్, తదితరులు

పాలకొండ: ఈస్టర్ పర్వదినం సందర్భంగా న్యూహోప్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎస్.బెన్హర్ మాట్లాడుతూ.. క్రీస్తు సమస్త మానవావళికి ఎనలేని ప్రేమను అందించారన్నారు. తమ ఫౌండేషన్ నుంచి క్రీస్తు మార్గంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి వారికి ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. పేద పిల్లల చదువులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు కోరారు. మండలంలోని తుమరాడ, తంపటాపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎన్.ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు, యువత చైతన్యవంతులై ప్రవర్తించాలన్నారు. ఎన్నికల కోడ్ పాటించాలని, హద్దులు దాటితే చట్టపరమైన చర్యలు, కేసులు తప్పవని స్పష్టం చేశారు.

జవహర్ నవోదయకు ఎంపిక


జీవన్‌ను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ లోకేష్


గేదెల దీపక్

వీరఘట్టం: మండలంలోని విక్రమపురం గ్రామానికి చెందిన వడ్డి జీవన్, వీరఘట్టం బార్నాలవీధికి చెందిన గేదెల దీపక్ జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో వీరు సత్తాచాటారు. వీరఘట్టంలోని సెయింట్ జేవియర్స్ స్కూల్‌లో చదువుతున్న ఈ ఇద్దరు విద్యార్థులను స్కూల్ మేనేజ్‌మెంట్ అభినందించారు. తమ కుమారుడికి నవోదయ విద్యాలయంలో సీటు రావడంపై తల్లిదండ్రులు గేదెల వెంకటలక్ష్మి, రాజు ఆనందం వ్యక్తం చేశారు.


కురుపాం: చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ జీవన్‌కుమార్


కురుపాం: ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు


గుమ్మలక్ష్మీపురం: ఎస్.కే.పాడు చర్చి వద్ద ఈస్టర్ వేడుకలు


వీరఘట్టం: తెలుగు బాప్టిస్టు చర్చ్‌లో ఈస్టర్ ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులంతా కలిసి ఘనంగా జరుపుకున్నారు. మానవులను పాపాల నుంచి విముక్తులను చేసేందుకు ప్రభువైన ఏసుప్రభు శివల చేయబడి మూడు రోజుల తరువాత పునరుత్థానం అయ్యారు. ఆయన రాకను స్వాగతిస్తూ ఆదివారం వేకువజాము నుంచి విశ్వాసకులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు సువార్తను చర్చి ఫాదర్లు విశ్వాసకులకు వినిపించారు. ఏసుక్రీస్తు మరణాన్ని జయించి లోకరక్షకుడు అయ్యారని అన్నారు. ఆయన సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. – సాక్షి పాలకొండ/కురుపాం


సీతంపేట: గొయిది ఫాతిమా మాత చర్చిలో ఏసుక్రీస్తు పునరుత్థాన ఘట్టం నాటక రూపంలో ప్రదర్శిస్తున్న చిన్నారులు


భామిని: బత్తిలి చర్చ్‌లో ప్రభువును పూజిస్తున్న విశ్వాసకులు


భామిని: బత్తిలిలో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


సీతంపేట: సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు


పాలకొండ రూరల్: కొత్తవీధిలో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రీస్తు విశ్వాసకులు

అడుగడుగున అపూర్వ ఆదరణ

- జోరుగా ఎమ్మెల్యే కళావతి ప్రచారం
- హారతి ఇచ్చి ఆశీర్వదిస్తున్న మహిళలు


అంపిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతితో పాటు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ/పాలకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ నుంచి మరోసారి ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న విశ్వాసరాయి కళావతికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ప్రచారంలో ఆమెకు అడుగడుగునా జనం నీరాజనాలు పలుకుతున్నారు. మండలంలోని వెలగవాడ, పరశురాంపురం, అంపిలి గ్రామాల్లో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా వెలగవాడ పంచాయతీ పరిధిలోని వెలగవాడ, సిరికొండ, రుద్రిపేట, సిరికొండగూడ, గదబవలస, మల్లమ్మగూడలో ఆమె ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. జగనన్న ప్రభుత్వంలో మాకు మంచి జరిగిందని, మళ్లీ జగనన్నే సీఎం కావాలని తామంతా కోరుకుంటున్నామని మహిళలు ఎమ్మెల్యేతో అన్నారు. రానున్న ఎన్నికల్లో తామంతా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తామని చెప్పడంతో ఎమ్మెల్యే చాలా సంతోషించారు. మహిళలంతా కలిసి ఎమ్మెల్యేతో పాటు ప్రచారంలో పాల్గొన్నారు. జై జగన్ నినాదాలతో గ్రామాలు హోరెత్తాయి. అనంతరం పరశురాంపురం, అంపిలి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అరుకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ తనూజారాణి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అంపిలిలో నిర్వహించిన ప్రచారంలో కళావతితో పాటు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.భాను, పార్టీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్‌రావు, వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్, రాజగోపాల్, ఎస్.ప్రసాద్, బలగ మన్మధరావు, మామిడి రమేష్, బలగ శివకుమార్, లోలుగు విశ్వేశ్వరరావు, చింత సంగన్నాయుడు, బూరాడ తేజేశ్వరరావు, రణస్థలం రాంబాబు, నవీన్,తదితరులు పాల్గొన్నారు.


వందలాది మందితో ఎమ్మెల్యే కళావతి ఎన్నికల ప్రచారం

ఉపాధి వేతనం పెంపు

కొమరాడ: జాతీయ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న వేతనదారులకు రోజువారీ వేతనం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఏపీఓ వి.బాలకృష్ణ ఆదివారం తెలిపారు. గత ఏడాది దినసరి వేతనం రూ.272 ఉండగా.. ప్రస్తుతం దాన్ని రూ.300కు పెంచిందని పేర్కొన్నారు. పెంచిన వేతనం నేటి నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు.

నేడు గొట్టమంగళాపురంలో ఎన్నికల ప్రచారం

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురం, చిన మంగళాపురం, యరకారాయపురం పంచాయతీల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని అన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ

గరుగుబిల్లి: సామాజిక పింఛన్‌లను ఈ నెల 3 నుంచి గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులతో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ పి.సూర్యనారాయణ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న ఈనెల నుంచి కోడ్ ముగిసేంతవరకు గ్రామ వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయవద్దని ఎలక్షన్ కమిషన్ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. మంచం నుంచి కదల లేనివారి పింఛన్ల పంపిణీపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉందన్నారు. దీన్ని పింఛన్‌దారులు గమనించాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీ అభ్యర్థి


పుష్పశ్రీవాణి దంపతులను సత్కరిస్తున్న అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజారాణి

జియ్యమ్మవలస: ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజును పార్టీ అరకు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ జి.తనూజారాణి, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శెట్టి వినయ్ ఆదివారం చినమేరంగిలోని ఎమ్మెల్యే స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. పుష్పశ్రీవాణి దంపతులు కూడా ఎంపీ అభ్యర్థికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రతినిధులు

సీతంపేట: కుడ్డపల్లికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ సవర ఆనప ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి డెత్ రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. శ్రీకాకుళం జిల్లా హిరమండలం పోలీస్ స్టేషన్ నుంచి పాలకొండ పోలీస్ స్టేషన్‌లో అటాచ్మెంట్ బేసిస్‌లో పనిచేస్తూ ఈ నెల 20న మృతిచెందారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాల మేరకు మృతుని భార్య లక్ష్మికి పోలీసు అసోసియేషన్ తరఫున జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కోశాధికారులు ఆర్.కృష్ణంనాయుడు, కె.భుజంగరావు పరిహారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, హెచ్‌సీ రాజారావు, కె.శ్రీనివాసరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు గ్రామానికి చెందిన గెంబలి ఈశ్వరరావు అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తుండగా చినమేరంగి ప్రతాప్ నగర్ కాలనీ వద్ద ఆదివారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిన్నంనాయుడు తెలిపారు.

తాలాడ తోటల్లో ఏనుగుల గుంపు


తాలాడ తోటల్లోకి చేరిన ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని తాలాడ సమీపంలోని తోటల్లో ఆదివారం ఏనుగులు గుంపు చేరి తిష్ట వేసింది. ఫారెస్ట్ అధికారులు, ట్రాకర్స్ వాటి గమనాన్ని పరిశీలిస్తూ గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నారు. వేసవి తాపం పెరగడంతో తాగునీటి కోసం వంశధార నదీ తీరం సమీపంలోకి చేరుకుంటున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారి లక్ష్మణమూర్తి సూచించారు. గ్రామంలో ఏనుగుల గుంపు తిష్టవేయడంతో తాలాడ రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఫీవర్ సర్వైలెన్స్‌పై ప్రత్యేక దృష్టి

- డీఎంఓ డాక్టర్ జగన్మోహనరావు


ఫాగింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో ఫీవర్ సర్వైలెన్స్ చేపట్టి మలేరియా, డెంగీ తదితర జ్వరాలను సత్వరమే గుర్తించాలని జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని దుడ్డుఖల్లు పీహెచ్‌సీ పరిధిలోని జర్న గ్రామాన్ని శనివారం రాత్రి వైద్య బృందంతో కలిసి ఆయన సందర్శించారు. గ్రామంలో దోమల నివారణకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. అలాగే ఫీవర్ సర్వైలెన్స్ చేపట్టారు. గ్రామంలో చేపట్టిన జ్వర నిర్ధారణ పరీక్షల నివేదికలను పరిశీలించారు. ఎవరికైనా జ్వరం అనిపిస్తే గ్రామంలో ఉన్న వైద్య సిబ్బందికి తెలియజేయలన్నారు. దోమతెరల వినియోగంపై అవగాహన కల్పించారు. వేసవి ఎండలు అధికమవుతున్నాయని, ప్రజలు డీహైడ్రేషన్‌కు గురికాకుండా తరచూ నీరు, ద్రావణాలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే చేపట్టాలని, జ్వరాలతో బాధపడుతున్న వారికి సరైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం దుడ్డుఖల్లు పీహెచ్‌సీని సందర్శించి ఓపీ, ల్యాబ్ రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఎంఓ సూర్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు


ఎర్రన్నగుడి జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

గరుగుబిల్లి: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని ఖడ్గవలస, ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో వాహనాల్లో మద్యం, నగదు అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకుని వెళ్లేవారు అందుకు తగిన ఆధారాలు, ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, జెండాలు ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామస్థాయి అధికారులపై ఉందన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి


హెచ్‌ఎం లిల్లీరాణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

సీతంపేట: చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తంనాయుడు అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఎ.లిల్లీరాణిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఎంతోమంది గిరిజన విద్యార్థులను ఉన్నతంతా తీర్చిదిద్దేందుకు ఆమె ఎంతగానో కృషి చేశారన్నారు. అలాగే ఐటీడీఏ డిప్యూటీ ఈవోగా ఉత్తమ సేవలందించారన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమశాఖ డీడీలు అన్నాదొర, రుక్మాగందరావు, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, జీసీసీ విశ్రాంత మేనేజర్ పక్కి గంగాధర్, ఎన్జీఓ సంఘ నాయకులు సాయిరాం, రంగాచారి, భరత్‌భూషణ్, హెచ్‌ఎంలు కె.సుబ్బారావు, పి.నారాయుడు, రామ్మోహన్‌రావు, టి.చంద్రరావు, ఎ.భాస్కరరావు, ఎం.భాస్కరరావు, పి.పద్మశ్రీ పాల్గొన్నారు.

● ప్రగతి బాట

మండలంలోని గొటివాడ పంచాయతీ లోమడ గిరిజన గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామానికి రోడ్డు నిర్మించాలని ఎన్నిసార్లు అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులను కోరినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిని కలిసి గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. ఆమె వెంటనే స్పందించి ఉపాధిహామీ నిధులు రూ.90 లక్షలు మంజూరు చేశారు. దీంతో టిక్కబాయి టీజీ రోడ్డు నుంచి లోమడ గిరిజన గ్రామం వరకు బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామానికి రహదారి సౌకర్యం రావడంతో విద్య, వైద్య సేవలతో పాటు జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని గ్రామస్తులు అంటున్నారు. –కురుపాం



అధ్వానంగా ఉన్న లోమడ గ్రామ రహదారి



రూ.90 లక్షలతో నిర్మించిన లోమడ బీటీరోడ్డు (నేడు)